# మన కబుర్లు

నెలనెలా సిలికానాంధ్ర విశేషాలు..వివరాలు..

## సిలికానాంధ్రులకు మరో అనిర్వచనీయమైన అనుభవాన్ని అందించేందుకు - ఆంధ్రకుటుంబ శిబిరం ఏర్పాట్లలో సిలికానాంధ్ర

క్రిందటి సంవత్సరం సరిగ్గా ఇలానే మే మొదటి వారంలో జరిగిన ఆంధ్ర కుటుంబశిబిరం తీపిజ్ఞాపకాలు ఇంకా శిబిరవాసుల మనసుల్లో తాజాగా మెదులుతుండగానే, మరోసారి అద్భుతమైన అనుభవాన్ని అందించేందుకు సిలికానాంధ్ర కార్యకర్తలు అహరహం శ్రమిస్తున్నారు. 400 మందికి (పిల్లలూ, పెద్ద వారూ..) రెండు రోజులపాటు కొండల మధ్యన, దట్టమైన అడవుల్లో పూర్తి గ్రామీణ వాతావరణాన్ని సృష్టించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాంప్‌కి సరిపడా సభ్యత్వాలు కూడా ఈ పాటికే వచ్చేశాయి. వారం రోజులు ముందుగానే రిజిస్ట్రేషన్స్ ముగియడం, తెలుగు వారికి సహజీవన సౌందర్యం పట్ల గల మక్కువని సూచిస్తోంది. అడవుల్లో పసందైన భోజనాలకూ, ఫలహారాలకూ కూడా ఎవ్వరికీ ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాంప్‌సైట్‌లో ఏ సెల్ ఫోన్లూ పనిచేయవు ( ఎవ్వరూ మిమ్మల్ని విసిగించరన్నమాట..!) అత్యవసరానికి ఒక లాండ్ లైన్ ఉంటుంది. చిన్న పిల్లలకు పాలు, మైక్రోవేవ్ ఓవెన్ కూడా ఉంటాయి. ఫస్ట్ ఎయిడ్ లో సుశిక్షితులైన కార్యకర్తలు టల్లో మీకేమైనా గాయాలైతే తక్షణమే ప్రాథమిక చికిత్స చేస్తారు. అందరినీ ఆనందింపచేసి, ఆకట్టుకునే భారీ సాంస్కృతిక కార్యక్రమాలు రూపు దిద్దికుంటున్నాయి. కాంప్‌కి హాజరయ్యే ప్రతి వారూ చేయవలసిన పని ఒక్కటే....అక్కడ వున్న ప్రతి క్షణం..హాయిగా, సంతోషంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపడమే..!


కాంప్ సైట్ లో ప్రణాళికా సమావేశం

కాంప్ ముగిసిన వెంటనే ఎప్పటిలానే ఒక వారం లోగా వీడియోలూ, ఫోటోలూ ఈ వెబ్‌సైట్ లో దర్శనమిస్తాయి..

కాంప్‌లో జరిగిన ప్రత్యేక విశేషాల్ని వచ్చేనెల మన కబుర్లు లో పంచుకుందాం..

## విజయవంతంగా శ్రీపార్థివ ఉగాది ఉత్సవం - స్వర సాహితీ సంగమం

వరుసగా నాలుగో సంవత్సరం, సిలికానాంధ్ర నిర్వహించిన పూర్తి సంప్రదాయ బద్ధమైన, అచ్చ తెలుగు ఉగాది కార్యక్రమం అత్యంత దిగ్విజయంగా లివర్‌మోర్ దేవాలయంలో ఏప్రిల్ 9 న జరిగింది. అచ్చమైన తెలుగు సంప్రదాయం ప్రకారం 1200 మందికి పైగా తెలుగు వారి సమక్షంలో జరిగిన ఈ ఉగాది ఉత్సవం.. తెలుగు వారు ఎక్కడవున్నా తెలుగు తనాన్ని మరచిపోరని మరోసారి నిరూపించింది. ఈ కార్యక్రమం గురించిన సమగ్రమైన ఫోటో కథనాలూ, వీడియోలూ ఈ సరికే మీరంతా చూసి వుంటారు.. ఈ కార్యక్రమంలోని కొన్ని పతాక సంఘటనలు

- అమెరికా పశ్చిమ తీరంలో పూర్తి స్థాయి తెలుగు కవిసమ్మేళనం జరగడం వరుసగా ఇది నాలుగవ సారి
- ఈ సారి కవిసమ్మేళనానికి స్థానిక కవులతో బాటుగా ఇతర నగరాలనుంచీ, ఇతర రాష్ట్రాలనుంచీ, భారతదేశం నుంచీ కూడ వచ్చిన కవులు పాల్గొన్నారు
- ఈ కవిసమ్మేళనంలో పాల్గొన్న 10 మంది కవుల్లో ఇద్దరు మెడికల్ డాక్టర్లూ, ఇద్దరు పరిశోధనా పట్టాలు పొందిన డాక్టర్లూ ఉన్నారు.
- ప్రతి కవీ తన కవిత చదువుతున్నప్పుడు ఆ కవితని పెద్ద తెరమీద తెలుగు లిపి లో ప్రొజెక్ట్ చేయడం వల్ల, ప్రేక్షకులు చదువుతూ, వింటూ కవితని ఆస్వాదించడానికి ఆస్కారం లభించింది.
- ఈ కార్యక్రమం 'స్వర సాహితీ సంగమం' కాబట్టి దేవులపల్లి గారికి అంకితమిస్తూ శ్రీ దేవులపల్లిగారు రచించిన కొన్ని గేయాలని, సిలికానాంధ్ర కళాకారులు, తామే స్వర పరచి, స్వయంగా ఆలపించారు.
- ఇలా స్వయంగా స్వరపరచి, ఆలపించిన పాటలు పదింటిని తీసుకుని ప్రొఫెషనల్ క్వాలిటీ ఆడియో సి.డి. ' ఆంధ్రకాహళి ' ని ఈ సందర్భంగా విడుదల చేసి, వచ్చిన వారందరికీ ఉచితంగా ఇచ్చారు.
- దేవులపల్లి వారి పాటలు దశబ్దాలుగా వినబడుతున్నప్పటికీ, వాటికి మళ్ళీ ఆధునిక రీతుల్లో స్వరాలు కూర్చి పాడడం , సి.డి విడుదల చేయడం అనేది బహుశా ఇదే మొదటి సారేమో..
- ఈ సి.డి.' ఆంధ్రకాహళి'ని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి మేనకోడలు శ్రీమతి వింజమూరి(అవసరాల) అనసూయాదేవి గారు ఆవిష్కరించడం..అదొక కమనీయ దృశ్యం
- ఆ రోజు ఉదయనుంచీ సాయంకాలం వరకూ జరిగిన తెలుగు భాషా పరిజ్ఞాన పోటీల్లో 125 మందికి పైగా బాల బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలకి న్యాయ నిర్ణేతలుగా రిటైర్డ్ ప్రొఫెసర్లూ, డాక్టరేట్లూ, తెలుగు పండితులూ వ్యవహరించడం సిలికానాంధ్ర నిర్వహించే కార్యక్రమాల స్థాయికి ఒక ఉదాహరణ.
- పోటీల్లో విజేతలకి ప్రత్యేక బహుమతులతో బాటుగా, పోటీల్లో పాల్గొన్న బాలబాలికలందరికీ జ్ఞాపికలూ, సర్టిఫికెట్లూ ఇవ్వబడ్డాయి.
- పోటీల్లో పాల్గొన్న చాలామంది బాలబాలికల ఫోటోల్ని వెబ్సైట్లో ఉంచడం జరిగింది. ఇలా పోటీల్లో

పాల్గొనవారందరి ఫోటోలూ పేరు , పేరునా వెబ్ సైట్లో ఉంచడం కూడా సిలికానాంధ్ర మొదలుపెట్టిన సత్సాంప్రదాయమే..

- కార్యక్రమం మొదటినుంచీ, చివరిదాకా హాలు కిక్కిరిసి నిండిపోయి ఉంది.
- దాదాపుగా 1200 మందికి పైగా హాజరై ఉంటారని ఒక అంచనా..
- అందరికీ పూర్తి స్థాయి విందు భోజనాన్ని సిలికానాంధ్ర కార్యకర్తలే వండి, వడ్డించారు. ఇంత భారీస్థాయిలో స్వయంగా వంటలు చేయడం కూడా సిలికానాంధ్రనే మొదలుపెట్టింది.
- బోజనాలు అయ్యాక ఇచ్చిన తాంబూలాల్లో, ప్రత్యేకంగా నాలుగు లైన్ల స్ఫూర్తిదాయకమైన కవితల్ని జతచేసి ' కవితా తాంబూలాలు 'గా అతిథులకి అందించారు. సిలికానాంధ్ర చేసిన ఈ ప్రయోగం ఆహూతల్ని అమితంగా కట్టుకుంది. కవితా తాంబూలాల్లో అందించిన కొన్ని కవితల్ని, కవితా సుభాషితాలుగా ఈ నెల నుంచీ మీకూ అందిస్తున్నాం.

## శ్రీదేవులపల్లి కృష్ణశాస్త్రి గారికి సిలికానాంధ్ర సమర్పించిన స్వరనివాళి ' ఆంధ్ర కాహళి ' ఆవిర్భవించిందిలా..!

ప్రతి ఉగాదికి ,, గత మూడు సంవత్సరాలుగా, ఒక కవితా సంకలనాన్ని ప్రచురించి ప్రేక్షకులకి ఉచితంగా ఇవ్వడం జరుగుతోంది. ఈ సారి ఏదైనా కొత్త ప్రయోగం చేయాలని అనిపించింది. కొత్త ప్రయోగం అంటే...- ఎలానూ ఈ కార్యక్రమాన్ని స్వర సాహితీ సంగమం అని నామకరణం చేశాం కాబట్టి, దేవులపల్లి వారి గీతాలని పాడదాం అనుకుంటున్నాం కాబట్టి, అవే పాటల్ని ఒక ఆడియో సి.డి గా రూపొందిస్తే ఎలా వుంటుందీ..? అని కూచిభొట్ల ఆనంద్‌కి ఒక ఆలోచన వచ్చింది. ఆలోచనకి బీజం పడగానే..ఇంక దాని చుట్టూరా.. ప్రణాళికలూ చక చకా రూపు దిద్దుకోసాగాయి.

ముందుగా పాటల ఎంపిక.. కృష్ణశాస్త్రి గారి పాటల సముద్రంలోంచి కొన్ని ముత్యాలనే ఎన్నుకోవాలి..ప్రతి పాటా ఆణిముత్యమే! ఐతే వాటిల్లో కొన్నింటినే అంటే.... దేశభక్తి, పల్లెటూరి అందాలు, ప్రణయ గీతాలు, ప్రకృతి వర్ణనలూ, కరుణరసం ఉప్పొంగే భావాలు..ఇలా ఒక్కొక్క భావాన్నీ తీసుకుని వాటిలో ఒదిగే 10 పాటల్ని ఖరారు చేయడం జరిగింది. ఐతే వీటిని ఎన్నో దశబ్దాలుగా ఎంతో మంది స్వరపరచి పాడుతున్నారు. అవే స్వరాలని తీసుకుని మనం పాడుదామా? ఇలా చేస్తే సిలికానాంధ్ర ప్రత్యేకత ఏముంటుందీ.. ఒక అనుకరణ తప్ప మన సృజనాత్మకత బయటపడదు..అందువల్ల సొంతంగానే స్వరాలు కూర్చుకోవాలి..ఈ పాటలకి అంత వైవిధ్య భరితమైన స్వరాలని అలవోకగా అందించాలని ఆశ. కార్యక్రమం చూస్తే పట్టుమని మూడు వారాలు కూడాలేదు.. ఎలాగైనా సాధించాలి..

ఇంతవరకూ సిలికానాంధ్ర కార్యక్రమాలకి సంగీతం సమకూరుస్తున్న వక్కలంక సూర్యని ఈ బృహత్తరకార్యక్రమానికి ఒప్పించడం జరిగింది. ఐతే ఆఫీసులో ఊపిరి సలపని పని ఒత్తిడీ, పైగా పది పాటలు

కేవలం వారంలోగా స్వరాలు కూర్చాలి..కొంచెం సంశయించిన సూర్యని భుజం తట్టి రంగంలోకి దింపారు ఆ-నంద్. ప్రతిరోజూ ఆఫీసునుంచీ రాగానే కీ బోర్డ్ ముందు కూర్చోవడం..తెల్లవారు ఝామున 4-5 వరకూ స్వరకల్పనలో నిమగ్నమవడం..మరురోజు ఆనంద్ తో కూర్చొని ఒకసారి తిరిగి చూసుకోవడం..సరిగ్గా ఆరో రోజుకల్లా 10 ట్యూన్లూ సిద్ధమయ్యాయి..

ఒక వైపు సూర్య ఈ పనిలో ఉండగా.. ఆనంద్ గాయనీ గాయకుల్ని ఎంపికచేయడం, వాయిద్యకారుల్ని సమకూర్చుకోవడంలో తలమునకలయ్యారు. 20 మంది వాయిద్య కారులూ, పది మందికి పైగా గాయనీ గాయకులూ..ఇంతమందిని సిలికాన్ వేలీలో , అందునా మామూలు పనిదినాల్లో సంప్రదించడం..చర్చించడం..సాధారణమైన విషయమేం కాదు..ఎలాగైతే సూర్య ట్యూన్లు సిద్ధం చేసే సరికి, -ఆనంద్ మిగతా కళాకారుల్ని సమకూర్చుకున్నారు...

సరిగ్గా ఇంకా రెండు వారాలుంది కార్యక్రమానికి..ఈ రెండు వారాల్లో 10 పాటలు ప్రాక్టీసు చెయ్యాలి, ఆ పైన ప్రొఫెషనల్ స్టూడియోలో రికార్డింగ్ చెయ్యాలి, ఆ ఫైలు తైవాన్ వెళ్ళి వెయ్యి సి.డి.లు తయారై సిలికాన్ వేలీకి రావాలి.. గత అగస్ట్‌లో 15 రోజుల్లో మూడు గంటల పద్యనాటకం ‘శ్రీకృష్ణరాయబారం‘ తయారు చేసిన రోజులు గుర్తొచ్చాయందరికీ.. అందరిలోనూ ఎలాగైనా మహాకవి దేవులపల్లి గారికి నివాళిగా చేపట్టిన ఈ ప్రోజెక్ట్‌ని విజయవంతంచేసి తీరాలి, సిలికానాంధ్ర సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలి..అన్న పట్టుదల పెరిగింది. ఒక వారం రోజులు..ప్రతిరోజూ సూర్య ఇంట్లో కళాకారులంతా సమావేశమయ్యేవాళ్ళు..అర్ధరాత్రి, తెల్లవారుఝామూ..ఏదో సమయం అయ్యేది..పగలు ఉద్యోగాలు, ఇంటికొచ్చాక చిన్న పిల్లల్ని సర్దుకోవడం..

**సమస్యలు ఎప్పుడూ ఉంటాయి..సవాలు చేసే సందర్భాలు తక్కువగా వస్తుంటాయి..(ఒక్కో సారి మనం పక్కకి వెళ్ళిపోతుంటాం కూడా!)..**

ఆ వారం పాటల ప్రాక్టీసుని అనుక్షణం గమనిస్తూనే, సుమన్ తో కూర్చొని సి.డి. కవర్ కి అవసరమైన డిజైన్లు చేయడంలో నిమగ్నమయ్యారు ఆనంద్. సుజనరంజని లో చిత్రాంజలి నిర్వహిస్తున్న శ్రీమతి చెముడుపాటి రమాదేవి గారిని సంప్రదించి ఒక్క రాత్రిలో మూడు పెయింటింగ్స్ వేయించి, వాటిలోంచి ఒకదాన్ని సి.డి. లోపలి కవర్‌కి ఎంచుకున్నారు. ఎక్కడో ఇంటర్‌నెట్ లో దొరికిన దేవులపల్లి వారి రేఖా చిత్రాన్ని ప్రింటింగ్ క్వాలిటీ కి మార్చడం, తెలుగు, ఇంగ్లీషు కలిపి ప్రొఫెషనల్ క్వాలిటీలో క్రెడిట్స్ కవర్ తయారు చేయడం.. సి.డి. లోపల అమర్చడానికి వీలుగా బీడ్స్ వదలడం.. అన్నీ మొదటి సారి చేస్తున్న పనులే..ఐనా పట్టుదల తో పని పూర్తి చేశాడు సుమన్.

ఇంకో వైపు రికార్డింగ్ థియేటర్ కోసం వేట..ఇదంతా మొదటిసారి చేస్తున్న అనుభవమే అందరికి.. స్టూడియోలో 10 పాటలు రికార్డ్ చేసేందుకు ఎంత టైము పడుతుందీ..ఎంత ఖర్చవుతుందీ..అంతా ఉజ్జయింపుగా ప్లాన్ చేసుకోవడమే..శాన్ హోసె లో టికి స్టూడియో ని ఒక రోజుకి అద్దెకి మాట్లాడడం జరిగింది..

ఏప్రిల్ 2 , శనివారం..కార్యక్రమానికి సరిగ్గా వారం రోజులుందింకా.. వచ్చే శనివారం 9 నే కార్యక్రమం.. ఈ రోజు ( ఏప్రిల్ 2న) రికార్డింగ్ జరిగితీరాలి.. ఎందుచేతనంటే, ఆదివారం స్టూడియో పనిచేయదు. సోమవారం

మిక్సింగ్ పూర్తిసేసి, సోమవారం సాయంకాలం 5.00 కల్లా సన్నీవేల్ లోని యునిక్ మీడియా కంపెనీకి ఇవ్వాలి. వాళ్ళు ఆ ఫైలుని తైవాన్ పంపించి సి.డి. లు తయారు చేయించి శనివారానికల్లా అందిస్తారు..ఇదీ ప్లాన్..!
అందరూ కలిసి ఉదయం 10.00 గంటలకల్లా రికార్డింగ్ స్టూడియో కి చేరుకున్నారు. దిలీప్ అందర్నీ సమన్వయ పరిచే కార్యక్రమాన్ని భుజాన వేసుకున్నారు. ఆయనకి లోగడ ఇలాంటి స్టూడియోల్లో పనిచేసిన అనుభవం కూడా ఉపయోగించింది. 11.00 గంటలకల్లా రికార్డింగ్ మొదలైంది..
అప్పుడు మొదలైంది అసలు సమస్య.. వాయిద్యాలన్నింటినీ హుక్ చేయడం, స్వర స్థాయిల్ని సమానం చేసుకోవడం, అందరు గాయనీ గాయకులూ తమ గళాల్ని మైకుకి సరి చేసుకోవడం మొదట్లో కొంచెం కంగాళీ గానే అనిపించింది. మన సంగీత వాయిద్యాలని స్టూడియో పరికరాలతో అనుసంధానం చేయడం అంత తేలికగా పూర్తికాలేదు. స్టూడియో యజమాని 65 సంవత్సరాల గ్రేడీ కీ , సూర్యకి మధ్య అనుసంధానకర్తగా శ్రీఫణి ఉండి, ఎలాగైతే మొత్తం సెట్ అప్ ని విజయవంతంగా పూర్తిచేశాడు. శనివారం సాయంకాలం 5.00 గంటలు..కేవలం 2 పాటలు మాత్రమే ఓకె అయ్యాయి..! నిజానికి ఈ సమయానికి 8 పాటలు పూర్తవాలి మొదట అనుకున్న ప్రకారం. ఓవర్ టైము సరే..అస్సలు ఈ ప్రాజెక్ట్ పూర్తవుతుందా..!? మరురోజు - ఆదివారం..ఎవరూ పనిచేయరు..స్టూడియో యజమాని గ్రేడీ చెప్పాడు..'నేను స్టూడియో పెట్టిన గత 40 యేళ్ళుగా ఒక్క సారికూడా ఆదివారం పనిచేయలేదు..రేపు స్టూడియో తెరిచే ప్రసక్తేలేదు..మీకేం కావాలన్నా ఈ రాత్రే రికార్డ్ చేయించుకోండి' అని.
సాధ్యమా..!? రాత్రి 10.00 గంటలకి మరో మూడు పాటలు..మొత్తం 5 పాటలు అయ్యాయి.. అదేరోజు డేలైట్ సేవింగ్ టైము మారడం వల్ల ఒక గంట గాలిలో కలిసిపోయింది..! దిలీప్ గారు అందర్నీ హుషారు పరుస్తున్నారు..'మనం అర్ధరాత్రి రికార్డ్ చేస్తున్నామన్న సంగతి వినే వారికి తెలీదు..మన స్వరాల్లో నీరసం కనిపించకూడదు..ఛీర్ అప్.." అంటున్నారాయన..ఇంటివద్దనుంచీ కొండిపర్తి భారతి గారు అందరికీ భోజనాలు తయారు చేసి పంపించారు.. పొద్దుటినుంచీ దాదాపు 30 మంది అక్కడే ఉన్నారు..ఎలాగైతే తెల్లవారు ఝామున 4.00 గంటలకి మరో మూడు పాటలు ..మొత్తం 8 పాటలు పూర్తయాయి. ఏం చేయాలి? అప్పటికే దాదాపు 18 గంటలుగా నిరవధికంగా, ఏ మాత్రం విసుగూ విరామం లేకుండా పనిచేసి సహకరించాడు గ్రేడీ. కళాకారులుకూడా చెక్కు చెదరని పట్టుదలతో అన్ని గంటలూ పనిచేశారు..
ఇంకా రెండు పాటలు, మరికొంత పాచ్‌వర్కూ మిగిలిపోయింది. ఇదంతా ఐతేనే సోమవారం మిక్సింగ్ అవుతుంది. పైగా సోమవారం అందరూ ఆఫీసులకి వెళ్ళి పోతారు.. ఏం చెయ్యాలి..ఇప్పటికే ఆలస్యం ఐపోయింది...ప్రాజెక్ట్ వదిలేయడమా..!? ఇది చాలా తేలికైన విషయం..కానీ ఇంతమంది..ఇన్ని రోజులు పడిన కష్టం ఒక వైపు..అవతల కృష్ణశాస్త్రి గారికి నివాళిగా చేపట్టిన కార్యక్రమం ఎలాగైనా వెలుగు చూసితీరాలన్న పట్టుదల మరోవైపూ..
ఎక్కడో చదివిన వాక్యం గుర్తుకొస్తోంది ' కొలంబస్ అమెరికాని కనిపెట్టకపోతే ఎవరూ అతని వద్దకెళ్ళి ' ఏమోయ్..అమెరికాని ఎందుకు కనిపెట్టలేదు..?" అని అడిగి వుండేవారు కాదు. కొలంబస్ అమెరికాని

**కనిపెట్టాడు కాబట్టే అతని పేరు చరిత్రలో నిలిచిపోయింది..**
**అసాధ్యాలుగా అనిపించిన పరిస్థితులకి లొంగిపోయి కాలగర్భం లో కలిసి పోయే వారు ఎంతో మంది ఐతే, అసాధ్యాలని సుసాధ్యాలుగా మలచుకుని చరిత్రలో నిలిచిపోయే వారు చాలా కొద్ది మంది..!**

'మీరంతా వెళ్ళి కాస్సేపు విశ్రాంతి తీసుకోండి..తరవాత ఏంచెయ్యాలో మధ్యాహ్నం నిర్ణయిద్దాం..ఏమాత్రం నిరాశ పడకండి..సి.డి. 9 వ తేదీన కార్యక్రమం లో రిలీజై తీరుతుంది..మీశ్రమ వృధా పోదు.." ఆనంద్, దిలీప్ లిద్దరూ హామీ ఇచ్చారు.




అందరూ ఇళ్ళకి వెళ్ళి నిద్రపోయారేమో కానీ ఆనంద్ ఇంటికి వెళ్ళిన వద్దనుంచీ, యెల్లో పేజెస్ తీసుకుని రికార్డింగ్ స్టూడియోలకి ఫోన్లు చేయడం.. తెలిసిన మిత్రుల ద్వారా మరొకొన్ని స్టూడియో లని సంప్రదించడం చేశారు. చివరికి కళాకారుల బృందంలో ఒకరూ, మొదటినుంచీ సిలికానాంధ్ర శ్రేయోభిలాషి ఐన శ్రీరాయసం ప్రసాదు గారి ద్వారా ఫ్రీమాంట్ లో ఎక్కడో మారుమూల ఒక స్టూడియో వాళ్ళు ఆదివారం సాయంత్రం పనిచేయడానికి ఒప్పుకున్నారు...చక చకా..ఫోన్లు వెళ్ళాయి..మళ్ళీ అందరూ ఫ్రీమాంట్ లోని స్టూడియో వద్దకి ఆదివారం సాయం కాలానికి చేరుకున్నారు. కేవలం ఈ కార్యక్రమంకోసమే ఫీనిక్స్ నుంచీ వచ్చిన శ్రీఫణి వాళ్ళ బాస్ కి ఫోన్ చేసి సోమవారం రావడం లేదని చెప్పాడు.. ఆదివారం సాయం కాలం కొత్త స్టూడియోలో మిగిలిన పాటల రికార్డింగ్ మొదలైంది..
ఏట్లాగైతేనేం..మళ్ళీ తెల్లవారు ఝామున 3.00 కి మిగిలిన రెండు పాటలూ, ఈ రెండు పాటల మిక్సింగ్ కూడా అయిపోయింది. తెల్లవారితే సోమవారం..అప్పటికి రెండు రాత్రులు నిద్రలేకుండా పనిచేశారు.. ఇంకా..8 పాటల మిక్సింగ్, పాచ్ వర్క్, రికార్డింగ్ మిగిలింది..
సోమవారం..ఏప్రిల్ 4 ఉదయం 9.00..మళ్ళీ సీను శాన్ హోసె లోని టికి స్టూడియో కి మారింది.. హైమానంద్, శ్రీఫణి(ఫీనిక్స్), నారాయణ, యామిని గారు, శ్రీధర్ గారూ.. ఆ రోజు ఆఫీసులకి శెలవుపెట్టేశారు.. ప్రతి పాటనీ.. పదే, పదే సునిశితంగా విని, ఎక్కడైనా అపశృతులు దొర్లితే మళ్ళీ రికార్డింగ్ చేయడం , అదయ్యాక అన్ని ట్రాక్స్ కలిపి మిక్సింగ్ చేయడం.. ఉదయాన్నుంచీ అలానే నిలుచున్న వాళ్ళు కదలకుండా యామిని గారు, నారాయణ మిక్సింగ్ లో నిమగ్నమయ్యారు.. సాయంకాలం 5.00 గంటలు..డెడ్ లైన్..యునిక్ మీడియా నుంచీ

ఫోను.."టేప్ రెడీ ఐందా?" అని..ఊహు..కాలేదింకా..

గంట..గంట..అంటూ..వాళ్ళకి సర్ది చెప్పడం..ఇక్కడ స్టూడియోలో క్వాలీటీ తగ్గకుండా పనులు నడిపించడం.. దాదాపు మూడు రోజులుగా అవిశ్రాంతంగా పనిచేస్తున్నా టీమ్ లో ఎక్కడా ఉత్సాహం సడల లేదు.. రాత్రి పదింటికి యునిక్ మీడియా నుంచీ ఫోన్ ' ఇంక మేము ఇంటికి వెళ్ళి పోతున్నాం..తైవాన్ ఫేక్టరీలో మీ పనికోసం రిజర్వ్ చేసిన ప్రొడక్షన్ లైన్ ని వేరే పనికి మళ్ళిస్తున్నాం..మీరు రెడీ ఐనప్పుడు చెప్పండి..చూద్దాం.." అని. మళ్ళీతెల్లవారు ఝామున 3.20 కి ఫైనల్ కాపీ టేపు చేతికొచ్చింది.. ఆనంద్ టేపు తీసుకుని సన్నీవేల్ లోని యూనిక్ మీడియా ఆఫీసుకి వెళ్ళి మెయిల్ బాక్స్‌లో టేప్‌ని వేసి, తెల్ల వారు ఝామునే వాళ్ళని లేపి విషయం చెప్పారు.. వాళ్ళు తెల్లవారు ఝామున 5.00 గంటలకి ప్రత్యేకంగా ఈ పని కోసమని ఆఫీసుకు వచ్చి, మొత్తం టేప్‌ని మరోసారి పరిశీలించి, తైవాన్ ఫేక్టరి సైట్‌కి అప్‌లోడ్ చేశారు..అప్పటికి తైవాన్ లో మంగళవారం రాత్రి ఐపోయింది.. తైవాన్ ఫేక్టరీ వాళ్ళు రాత్రి షిఫ్ట్ లో కొంత ప్రొడక్షన్ లైన్‌ని దీనికి కేటాయించి 1000 సి.డిల ఉత్పత్తిని మొదలు పెట్టారు. ముందుగా తయారు చేసిన సి.డి.ల మీద ఆడియో ట్రాక్స్ రికార్డింగ్ చేయడం కాకుండా, సి.డి. తయారయ్యేప్పుడే ఆడియో కూడా సమ్మిళతమై, ఫైనల్ సి.డి. బయటికి వచ్చే సాంకేతిక పరిజ్ఞానంతో, పైన ఒరిజినల్ కవర్‌ప్రింటింగ్ తో వెయ్యి సి.డి లు తయారై, ఎయిర్ ఫ్లైట్ లో శుక్రవారం సాయం కాలానికి సిలికాన్ వేలీ కి చేరుకున్నాయి..!!

శనివారం..1200 మందికి పైగా అభిమానుల సమక్షంలో దేవులపల్లి గారికి స్వర నివాళి, 'ఆంధ్ర కాహళి' ఆ-విష్కరణ, 'కళాప్రపూర్ణ' డాక్టర్ వింజమూరి(అవసరాల) అనసూయాదేవి గారి చేతులమీదుగా జరిగింది..!

విన్న ప్రతివారినుంచీ అనూహ్యమైన ప్రతి స్పందన అందుకున్నప్పుడు..బృందం అందరి మొహంలో ఈ ఆనందమే కనిపించింది.. ..! గత మూడు వారాలుగా పడ్డ అవిరామ శ్రమ ఒక తీయని జ్ఞాపకంగా మిగిలింది.. !!

కొసమెరుపు: ఈ సి.డి.లోని కొన్ని పాటల్ని ఆస్టిన్ తెలుగు అసోసియేషన్ వారు నిర్వహించిన ఉగాది వేడుకలలో(ఏప్రిల్ 23 న) , కార్యక్రమ ప్రారంభంలో వినిపించారు. అవి విన్న ఆస్టిన్ తెలుగు మిత్రులు ఆ పాటల మాధుర్యాన్ని అమితంగా ఆస్వాదించి, వివరాలకోసం సిలికానాంధ్ర ని సంప్రదించారు.

## ప్రత్యక్ష సాక్షి ప్రతిస్పందన

పార్థివ ఉగాది ఉత్సవాలకోసం చికాగో నుంచీ ప్రత్యేకంగా సిలికాన్ వేలీకి వచ్చి, కవి సమ్మేళనంలో పాల్గొన్న శ్రీ రమానాథ్ కందాళ గారు సిలికానాంధ్ర కార్యకర్తల కృషి ని ప్రత్యక్షంగా గమనించాక , తన ప్రతిస్పందనని క్రింది కవిత రూపంలో తెలియ చేశారు..

# సిలికానాంధ్రా సిపాయి

(పార్థివ ఉగాదికి నడుములు బిగించి, వంచి కృషి చేసిన సిలికానాంధ్ర కార్యకర్తలకు అభినందనల తో - రమానాథ్ కందాళ)

ఏయ్ .. నిన్నే..

ఓ సారాగు..!

ఎక్కడికా పరుగు?

ఆకర్ణాంతం సారించిన

శింజిని బిగువంతా

ఆసాంతం పుంజుకుని,

సదాగతుని అధిగమించి

మనోధర్మమవఘళించి,

దిశాంతాలు స్పృశించే

ధనుర్ముక్త శరం లా..

ఎక్కడికా ఉరుకు?

ఏయ్ .. నిన్నే..

ఎవరో నీ సంధాన కర్త?

ఎవరో నీ లక్ష్యావిష్కర్త? చెప్పవూ..

నీ వదనంలో ప్రభూతమై కదలాడే

బీళ్ళు  ససస్య మొనర్చే సత్వం,

నీ నయన యుగళి ప్రగాఢమై ప్రకాశించు

రాళ్ళు బొమ్మగ మలిచే యత్నం,

నీ పెదవుల లీలగ దోబూచులాడు

మోళ్ళు చిగిర్చే రహస్యం..

ఎందుకో ? ఎవరికో ?

నువ్వెవరివో ? చెప్పవూ..!

...

నేనా..? నేనెవరినా..?

ఆగలేను కానీ

ఆదరణతోనె చెపుతున్నా..

నే బాణమైన భటుడను

సిలికానాంధ్రా బిడ్డను..

ఆయుధమూ నేనే,

ప్రయోగమూ నాదే

ప్రేరణ మాత్రం తల్లిది..!

వరాల నా తెలుగుతల్లి

శరతల్ప శాయి కాబోతే

ప్రాపుగ, వెనుకాపుగ కమ్మని

కనుసన్నయినది కాదా..?

అమృత లబ్ధి అయేవరకు

అమ్మకి నే ఆధారం

అటు పిమ్మట తన గళాన

నే ప్రఫుల్ల సుమహారం!

ఇంతకీ.. నువ్వెవరో?..

...

ఇంకెవరిని?.

చేష్టలుడిగి చూస్తు న్న

నిబిడాశ్చర్యాన్ని !

నితాంత హర్షాన్ని !

నన్నిలా సదా ఎదగనీ..

పెన్నగమై పెరగనీ..

********